ప్రజాశక్తి
గురువారం 8 ఆగస్టు 2024





గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

పాలకుల విధానాలతో చేనేత సంక్షోభం

◆ నేతన్నలను ఆదుకునే చర్యలు చేపట్టండి
◆ జాతీయ చేనేత దినోత్సవంలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ప్రభుత్వాలు అవలంభిస్తున్న అసమర్ధ విధానాలతో గత దశాబ్ధకాలంగా చేనేత రంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందని సిపిఎం నాయకులు విమర్శించారు. జాతీయ చేనేత దినోత్సవ సందర్భంగా బుధవారం నాడు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వ విధానాలకు నిరసనగా మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, సిపిఎం పట్టణ కార్యదర్శి శేషంపల్లి మారుతి, సిఐటియు మండల కార్యదర్శి జెవి.రమణ, కో కన్వీనర్ అయూబ్ ఖాన్ మాట్లాడుతూ బిజెపి పాలనలో చేనేత వ్యవస్థ నిర్వీర్యం అవుతోందన్నారు. చేనేత పరిశ్రమ, చేతివత్తులకు అవసరమైన బడ్జెట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించక పోవడంతో కార్మిక వ్యవస్థ అనేక రకాల కష్టాల ఊబిలో కూరుకు పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 1905 సంవత్సరంలో విదేశీ వస్త్రాలను బహిష్కరించాలి, స్వదేశీ వస్త్రాలను కాపాడాలనే నినాదంతో కార్యక్రమం తీసుకుని ఆగస్టు 7న చేనేత జాతీయ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత వత్తిని నిర్వీర్యం చేసే విధంగా విధానాలు రూపొందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హ్యాండ్‌లూమ్‌కు రక్షణ కవచంలా ఉన్న 11 రకాల చేనేత రిజర్వేషన్ చట్టాన్ని నిర్వీర్యం చేశారన్నారు. దీని వల్ల హ్యాండ్‌లూమ్ పతనం అయ్యి, దాని స్థానంలో పవర్‌లూమ్ చేరిందన్నారు. పవర్‌లూమ్స్ నిర్వాహకులు 11 రకాల చేనేత రిజర్వేషన్ చట్టాన్ని నిర్వీర్యం చేసి చీరులు తయారు చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన బడ్జెట్‌ను చేనేత రంగానికి కేటాయించాలన్నారు. ప్రత్యేక చేనేత బ్యాంకును ఏర్పాటు చేయాలన్నారు. సబ్సిడీతో ముడిసరుకులు అందించాలని, చేనేత పరిశ్రమలో తయారైన చీరలకు ప్రభుత్వమే మార్కెట్ సౌకర్యం కల్పించాలన్నారు. చేనేత కార్మికుల ఆత్మహత్యలు చేసుకోకుండా కాపాడుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు వెంకటస్వామి, హరి, సన్నప్పయ్య, బడిగింజల ప్రకాష్, రవి పాల్గొన్నారు.


వైసిపికి 'పైలా' రాజీనామా

అనంతపురం వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య పార్టీ, అధ్యక్ష పదవి రెండింటికీ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు సోషియల్ మీడియాలో వీడియోను బుధవారం నాడు విడుదల చేశారు. తన వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అందరూ ఇంతకాలం సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఎటువంటి ఆరోపణలుగానీ, విమర్శలుగానీ లేకుండానే సాదాసీదాగా తన రాజీనామా ప్రకటనను ఆయన చేశారు. ఎన్నికల ఫలితాల వెలువడినప్పటి నుంచే వైసిపిలో సంస్థాగతమైన మార్పులుంటాయని ప్రచారం నడుస్తూ వచ్చింది. అనంతపురం జిల్లాకు కొత్త అధ్యక్షుడిని కోసం పరిశీలన సాగుతున్నట్లు కూడా గత కొంతకాలం ప్రచారం నడుస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే ఉన్న అధ్యక్షుడు తనంతట తానుగా పదవికీ, పార్టీకి రాజీనామా చేయడం గమనార్హం. ఇక కొత్త అధ్యక్షుడు ఎవర్ని ఎన్నిక చేస్తారన్న దానిపై ఆ పార్టీలో సర్వత్రా చర్చ నడుస్తోంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



◆ కొత్త జిల్లా అధ్యక్షులెవరో ?
◆ బాధ్యతలు చేపట్టేందుకు ముఖ్య నేతల విముఖత
◆ నియోజకవర్గ సమన్వయకర్తగా ఉంటే చాలనే భావన


పైలా నరసింహయ్య

2012లో వైసిపి ఆవిర్భావం అయినప్పటి నుంచి జిల్లా అధ్యక్షుల విషయంలో ఆ పార్టీలో తరచూ మార్పులు చోటు చేసుకుంటూనే వస్తున్నాయి. కొంత కాలం శంకర నారాయణ, మరికొంత కాలం నదీమ్ అహమ్మద్, ఆ తరువాత పైలా నరసింహయ్య ఇలా మార్పులు, చేర్పులు జరుగుతూ వస్తున్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో వైసిపి 12 స్థానాల్లో విజయం సాధించింది. ఆ తరువాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అత్యధిక స్థానాల్లో వైసిపి మద్దతుదారులు విజయం సాధించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ గణనీయమైన స్థానాల్లోనే విజయం సాధిస్తుందని వైసిపి నేతలు ధీమాతో ఉంటూ వచ్చారు. అయితే ఈ ఎన్నికల్లో వైసిపి ఒక్క స్థానంలోనూ గెలవలేక చతికిలబడింది. 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాల్లోనూ ఓటమిని చవిచూసింది. ఇంతటి ఘోరమైన ఓటమి తరువాత పార్టీని తిరిగి పట్టాలపైకి ఎక్కించేది ఎవరన్న దానిపై ఇప్పుడు చర్చ నడుస్తోంది. ఇందుకు అనుగుణంగా మార్పులు చేపట్టాలని పార్టీ అధిష్టానం కూడా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ బాధ్యతలను సీనియర్ నాయకులకు అప్పగిస్తే ప్రతిపక్షానికి ధీటుగా నిలబడే అవకాశం ఉంటుందన్న భావన అధిష్టానం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఎవరు ఈ బాధ్యతలు స్వీకరించి కష్టకాలంలో పార్టీని నడిపిస్తారన్నది ప్రశ్నార్థకంగా ఉంది. ప్రస్తుతానికి అధ్యక్ష బాధ్యతలను ఎవరూ తీసుకోవడానికి ఆసక్తి కనబరుస్తున్నట్లు కన్పించడం లేదు. నియోజకవర్గ సమన్వయకర్తలుగా ఉంటే చాలన్న అభిప్రాయంతోనే చాలా మంది నేతలు ఉన్నారు. జిల్లా అంతటా భారాన్ని మోసేందుకు పెద్దగా ఎవరూ ఆసక్తి కనబరచడం లేదన్న చర్చ ఆ పార్టీ వర్గాల్లో నడుస్తోంది. ఇప్పుడే పార్టీ ఘోర ఓటమిని చవిచూసిన నేపథ్యంలో రాబోయే ఐదేళ్లు నడిపించాలంటే ఆర్థికపరమైన భారాలతోపాటు, నాయకులను సమన్వయపరచడం కష్టసాధ్యమని భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే పార్టీ అధిష్టానం ఎవరిని ఒప్పించి జిల్లా అధ్యక్ష బాధ్యతలను అప్పగిస్తుందో చూడాల్సి ఉంటుంది. అటు సత్యసాయి జిల్లాలోనూ మార్పులుంటాయని తెలుస్తోంది. అక్కడ కూడా ఎవరిని నియమిస్తారో చూడాల్సి ఉంది.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

పంద్రాగస్టు వేడుకలను విజయవంతం చేద్దాం

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఈనెల 15న నిర్వహిస్తున్న స్వాతంత్ర్య దినోత్సవాన్ని జిల్లాలోని అధికారులందరూ సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్లో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ కొండయ్య, అదనపు ఎస్పీ విష్ణు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేడుకలలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతంగా నిర్వహించాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను ఆహ్వానించాలన్నారు. వేడుకల్లో పాల్గొనే వారికి మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్లో అవసరమైన ఏర్పాట్లు అన్ని ఈనెల 13 నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని అవసరమైన మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివద్ధికి సంబంధించి ప్రగతిని చాటి చెప్పే విధంగా శకటాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయాలని, అన్ని శాఖల వారు శకటాలు ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. పరేడ్ మైదానంలో సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. అవార్డుల కోసం ఉత్తమ సేవలు అందించిన వారి వివరాలు అందజేయాలన్నారు. విద్యుత్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 15న అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సెప్టెంబర్ నెల 20 నాటికి 100 రోజుల్లో ఏ కార్యక్రమాలు చేపట్టారో నివేదికలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

నేడు పాఠశాల కమిటీల ఎన్నిక

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

మండల పరిధిలోని 101 పాఠశాలల్లో గురువారం పాఠశాల విద్యా కమిటీలను ఎంపిక జరుగుతుందని మండల విద్యాశాఖాధికారులు గోపాల్ నాయక్, రాజేశ్వరి దేవి తెలిపారు. ఈ కమిటీ రెండు సంవత్సరాలు పాటు కాల పరిమితి ఉంటుందని చెప్పారు.

పుట్టపర్తి రూరల్: ప్రభుత్వ నిబంధనల మేరకు స్కూల్ కమిటీ ఎన్నికలను నిర్వహించాలని పుట్టపర్తి ఎంఇఒ ప్రసాద్ సూచించారు. ఈ మేరకు ఆయన పుట్టపర్తి ఎంఆర్‌సికార్యాలయంలో బుధవారం మండలంలోని, ప్రాథమిక ప్రాథమికోన్నత, ఉన్నత, ఆదర్శ కస్తూరిబా, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. గురువారం జరగబోవు ఎన్నికలను ప్రభుత్వ నిబంధన మేరకు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 48 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు మానండి : మాజీ జెడ్పీటీసీ

ప్రజాశక్తి - అమరాపురం


విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ

తనపై చేస్తున్న అర్ధరహిత ఆరోపణలు మానుకోవాలని మాజీ జెడ్పీటీసీ నరసింహమూర్తి హెచ్చరించారు. ఈసందర్భంగా ఆయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. సొంతపార్టీకి చెందిన కొందరు టిడిపి నాయకులు తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పని చేస్తున్నానని ఎన్నో పదవులు సైతం అనుభవించానని చెప్పారు. అధిష్టానం మాజీ ఎమ్మెల్యే కుమారుడు సునీల్‌నిఎమ్మెల్యే అభ్యర్థి గా ప్రకటిస్తే పార్టీ తరుపున 25రోజులు ప్రచారంలో పాల్గొన్నానని చెప్పారు. తిరిగి ఎంఎస్ రాజుకు అధిష్టానం ఎమ్మెల్యే అభ్యర్థిగా బి పారం ఇస్తే ఆయన తరపున కూడా పనిచేశానని చెప్పారు. ఇప్పుడు తనపై లేని పోనీ ఆరోపణలు చేస్తున్నారని అలాంటి వారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. తాను జీవితాంతం టీడీపీలోనే ఉంటానని మరోపార్టీ వారితో డబ్బులు తీసుకునే అవసరం లేదని అన్నారు. తనపై ఆరోపణలు చేసే వారు జాగ్రత్తగా మాట్లాడాలని హెచ్చరించారు.

ఈ -పంట నమోదుపై అవగాహన

నంబులపూలకుంట : మండల కేంద్రం లోని వ్యవసాయ అధికారి కార్యాలయం లో ఈ -పంట నమోదుపై అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వీఆర్వోలు, సర్వేయర్లు, రైతు సేవ కేంద్ర సిబ్బందికి ఈ పంట నమోదుపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ నరేంద్ర కుమార్, మండల వ్యవసాయ అధికారి వి.లోకేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చేనేతను వస్త్రాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

చేనేతలకు అన్ని విధాలా ప్రోత్సాహం

జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

చేనేతలను అన్ని విధాలా ప్రోత్సహించడానికి ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని కార్మికులు అభివద్ధి చెందాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలియజేశారు. చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక హనుమాన్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేతలు ర్యాలీ నిర్వహించారు. అక్కడ చేనేతల నేసిన వస్త్రాలను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. పలువురు చేనేత కార్మికులను జాయింట్ కలెక్టర్ శాలువాలతో సన్మానించారు. చేనేతలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను జేసీ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ చేనేతల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నీ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను చేనేతలకు వర్తింపజేస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ చేనేత వస్త్రాలు ధరించి, చేనేత పరిశ్రమను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. చేనేత వస్త్రాల అమ్మకాలకు ఇప్పటికే ఆప్కో ద్వారా వస్త్ర దుకాణాలు ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ జిల్లా అధికారి రమేష్, కెవి.రమాకాంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాషా, పట్టు పరిశ్రమ శాఖ అధికారి పద్మమ్మ, జిల్లా నైపుణ్య అభివద్ధి శాఖ అధికారి ఖయ్యూంతో పాటు చేనేత కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి స్పందన హర్షణీయం : ఓబులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శ్రీ సత్యసాయి తాగునీటి సరఫరా పథకానికి నిధులు కేటాయించి, సక్రమంగా దీనిని నడపాలని కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించడం హర్షణీయం అని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు తెలిపారు. శ్రీ సత్యసాయి నీటి సరఫరా ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 750 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోందన్నారు. ఈ పథకంలో 572 మంది కార్మికులు గత 22 సంవత్సరాలుగా పనిచేస్తున్నారని తెలిపారు. కరోనా సందర్భంగా కూడా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని కార్మికులు పని చేశారని తెలిపారు. గత ప్రభుత్వంలో కార్మికులు వేతనాల కోసం నాలుగు నెలలకు ఒకసారి సమ్మెలు, నిరసనలు తెలపాల్సిన పరిస్థితులు ఉండేవన్నారు. తాగునీటి సరఫరా పథకం కార్మికుల సమస్యలపై మంత్రి పయ్యావుల కేశవ్‌ను గత నెలలో సిఐటియు ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందించామన్నారు. రాష్ట్ర కలెక్టర్ల సమావేశంలో అనంతపురం జిల్లా కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తాగునీటి పథకంపై ప్రస్తావన చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి స్పందించి నిధులు కేటాయించి కార్మికులకు వేతనాలు చెల్లించి స్కీం సక్రమంగా నడిచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇవ్వడం అభినందనీయం అన్నారు. జిల్లా అధికారులు స్పందించి ఇప్పటి వరకు కార్మికులకు బకాయి ఉన్న వేతనాలు అందజేసి, పిఎఫ్, ఇఎస్ఐ, సమస్యలను పరిష్కరించాలని కోరారు.

స్వర్ణకారుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్


స్వర్ణ కారులతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

స్వర్ణకారుల సమస్యలను ప్రభుత్వ దష్టికి తీసుకెళ్లి అంతర్రాష్ట్ర పోలీసుల వేధింపులు ఆపేలా చర్యలు తీసుకుంటామని టిడిపి ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. స్వర్ణకారుల సంఘం అసోసియేషన్ సభ్యులు స్థానిక టిడిపి కార్యాలయంలో పరిటాల శ్రీరామ్‌ను బుధవారం కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు.

పార్కింగ్ కేంద్రంగా తహశీల్దార్ కార్యాలయం

పెనుకొండ తహసిల్దార్ కార్యాలయం వాహనాల పార్కింగ్ కేంద్రంగా మారింది. కార్యాలయం పట్టణం నడిబొడ్డున ఉండడం తో కార్లు, ద్విచక్ర వాహనాలు కార్యాలయం ఆవరణలో నిలుపుతున్నారు. కార్యాలయంలో ఉద్యోగులు ఎవరు సామాన్య ప్రజలు ఎవరో గుర్తుపట్టేందుకు వీలు లేకుండా ఉంది. కార్యాలయం ఆవరణం సంతను తలపిస్తోంది. పలు సమస్యల పై రెవెన్యూ కార్యాలయానికి వచ్చే ప్రజలు దిక్కుతోచక వారికి కావాల్సిన అధికారులను వెతుక్కోవాల్సి దుస్థితి నెలకొంది. మరికొందరు వాహనదారులు తమ ద్విచక్ర వాహనాలను కార్యాలయంలో నిలిపి బస్సులు ఎక్కి వెళుతున్నారు. ఈ వాహనాలు రెవిన్యూ అధికారులవా లేక బయట వ్యక్తులకు చెందినవా అని గుర్తించలేక రెవెన్యూ సిబ్బంది సతమతమవుతున్నారు.

ప్రజాశక్తి-పెనుకొండ


తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో నిలిపిన వాహనాలు

తాగుబోతులకు నిలయం
కార్యాలయానికి రక్షణ కరువు
రెవెన్యూ రికార్డులకు కొరవడిన భద్రత

పెనుకొండ తహశీల్దార్ కార్యాలయం ప్రధాన కూడలిలో ఉన్న నేపథ్యంలో రోడ్డు విస్తరణలో భాగంగా కార్యాలయ ప్రహరీని ఆర్ అండ్ బి అధికారులు తొలగించారు. ఆవరణలో తహశీల్దార్ కార్యాలయం తో పాటు సబ్ ట్రెజరీ, చౌక ధరల సరుకుల గోడౌన్లు ఉన్నాయి. సబ్ ట్రెజరీకి రోజు బిల్లుల కోసం తదితర సమస్యలపై ప్రజలు వస్తూ ఉంటారు. మరోపక్క భూములకు సంబంధించిన సమస్యలపై రెవెన్యూ కార్యాలయానికి ప్రతిరోజు వందల సంఖ్యలో బాధితులు వచ్చి సంబంధిత అధికారులను కలుస్తుంటారు. అదేవిధంగా రొద్దం, సోమందేపల్లి, పెనుకొండ మండలాలకు సంబంధించి రేషన్ షాపులకు ఇక్కడ ఉన్న గోడౌన్‌లో నుంచి లారీలలో బియ్యాన్ని తరలిస్తారు.

రెవిన్యూ రికార్డులకు భద్రత భయం..

ఆవరణలో రెవిన్యూ రికార్డుల భవనం ఉంది. బయట వ్యక్తులు ఇష్టారాజ్యంగా కార్యాలయం చుట్టూ తిరుగుతూ వాహనాలను నిలుపుతున్నారు. కియా పరిశ్రమ రావడంతో పెనుకొండ మండలంలోని భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. దీనికి తోడు కొందరు రియల్టర్లు నకిలీ పత్రాలు సృష్టించి భూములను కబ్జా చేసిన సంఘటనలు సైతం జరిగాయి. నూతన ప్రభుత్వం వచ్చిన తరువాత మదనపల్లిలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డు భవనానికి నిప్పు పెట్టిన ఉదంతం ఇక్కడ కూడా పునరావృతం అవుతుందేమోనని అధికారులు, సామాన్య ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విలువైన రెవిన్యూ రికార్డులకు భద్రత కరువైందని కార్యాలయ ప్రహరీ కూల్చివేయడంతో బయట వ్యక్తులు రాత్రిళ్ళు తిరుగుతున్నారని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మద్యం ప్రియులకు నిలయం

తహశీల్దార్ కార్యాలయానికి ప్రహరీ లేకపోవడంతో మద్యం ప్రియులకు ఈ ఆవరణం అడ్డాగా మారింది. సాయంత్రం 6 దాటితే మద్యంప్రియులు కార్యాలయం వెనక చేరి తమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో కార్యాలయంలో ఏ క్షణం ఏమి జరుగుతుందోనని భయాందోళనలో అధికార యంత్రాంగం ఉంది. రోడ్డు విస్తరణలో ప్రహరిని కూల్చిన ఆర్‌అండ్‌బి అధికారులు తిరిగి నిర్మించకపోవడంతోనే ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలు కార్యాలయం ఆవరణలో జరుగుతున్నాయని అధికారులు అంటున్నారు. రెవెన్యూ కార్యాలయానికి ఆనుకొని బియ్యం గోడౌన్ ఉంది. గోడౌన్లో ఉన్న బియ్యాన్ని సైతం గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించే అవకాశం లేకపోలేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

భూమి ప్లాట్లు తదితర రెవిన్యూ సమస్యలపై వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూ అధికారులు కలవాలంటే వారు అక్కడున్న వారందరినీ అడుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెవిన్యూ కార్యాలయం చుట్టూ బయట వ్యక్తులు వచ్చి కూర్చొని పిచ్చాపాటి మాట్లాడుకుంటూ ఉండడంతో సమస్యలపై వచ్చిన ప్రజలు కార్యాలయంలోకి వెళ్లాలంటే వారిని దాటుకొని వెళ్లాలి. సమస్యలపై వచ్చే ప్రజలు తమ వాహనాలను నిలపడానికి సైతం స్థలం ఉండడం లేదని పలువురు వాపోతున్నారు.

ప్రహరీ నిర్మాణం చేపడతాం

ప్రహరీ లేకపోవడంతో బయట వ్యక్తులు కార్యాలయం ఆవరణలో తమ వాహనాలను నిలుపుతున్నారు. ఈ విషయం ఉన్నత అధికారులు దృష్టికి తీసుకెళ్లి ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.కార్యాలయ ఆవరణలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

శ్రీధర్, తహశీల్దార్


బాధితులకు ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే చేయూత

ప్రజాశక్తి - కదిరి అర్బన్

పులివెందుల సమీపంలోని నామాల గొంది వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో నియోజకవర్గ పరిధిలోని తలుపుల మండలంలోని బట్రేపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు దుర్మరణం చెందారు. మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా అండగా ఉంటానని ఆరోజు మాటిచ్చిన కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఇచ్చిన మాటకు కట్టుబడ్డాడు. మృతిచెందిన మహిళలకు సంబందించి ఒక్కొక్క కుటుంబానికి లక్ష రూపాయలను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ బుధవారం అందజేశారు. విద్యాపరంగా మృతుల కుటుంబ పిల్లలకు అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తానని భరోసా ఇచ్చారు.

సక్రమంగా ఉపాధి బిల్లులు అందిస్తాం

ప్రజాశక్తి - రొద్దం

ఉపాధి బిల్లులు కూలీలకు సక్రమంగా అందజేస్తామని ఏపీవో అనిల్‌కుమార్ అన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో కూలీలు ఉపాధి పనులకు హాజరుకావాలని ఆయన కోరారు. బుధవారం మండలంలోని రొద్దం చిన్న చెరువులో ఉపాధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ సోమవారం నుంచి శనివారం వరకు పనులు చేపట్టిన బిల్లులను ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా బుధవారం రోజునే స్లిప్పులు అందజేస్తామని అనంతరం అకౌంట్లో డబ్బులు జమ అవుతాయని చెప్పారు. పెండింగ్ బిల్లులు కూడా వెంటనే అందే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనాథ చౌదరి, చెన్నకేశవులు, నాగేంద్ర, చంద్రశేఖర్, రుద్ర, అక్బర్, రామాంజి, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎపిఒ



రైతులకు యూరియా అందజేస్తున్న దృశ్యం

రైతులకు అందుబాటులో ఎరువులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - రొద్దం

అధికారులు మండల రైతులకు ఎరువులను అందుబాటులోకి తీసుకువచ్చారు. 'రైతులకు అందని యూరియా' అనే శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఒక లారీ యూరియా మండలానికి తెప్పించారు. మరికొంత యూరియా కూడా మండలానికి వస్తుందని ఎఒ నివేదిత తెలిపారు. రైతులకు యూరియాను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. అదే విధంగా ఎరువులు ఎక్కువ ధరలు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రతిభా విద్యార్థులకు ప్రోత్సాహకం

ప్రజాశక్తి - లేపాక్షి

మండలం పరిధిలోని చోళ సముద్రం ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ రమానంద తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థికి లాప్టాప్, రెండవ బహుమతిగా 25 వేల రూపాయలు, మూడవ బహుమతి పదివేల రూపాయలు తోపాటు ఎంతమంది విద్యార్థులు మొదటి ర్యాంకు సాధించిన వారందరికీ కూడా బహుమతులు అందజేస్తానని చెప్పారు. దీంతో పాఠశాల సిబ్బందితోపాటు అధికారులు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గోపి, నాయకులు జయచంద్ర, శివ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలకు శిక్షణ

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు వ్యాపార నిర్వహణ శక్తి సామర్థ్యంపై ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మక్బుల్ హుస్సేన్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూమ్ తెలిపారు. ఈనెల 12వ తేదీ నుంచి 15 వరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్నినిరుద్యోగ యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లాప్‌మిత్రలను కొనసాగించాలి

ప్రజాశక్తి - సోమందేపల్లి

పంచాయతీలో పనిచేసే క్లాప్ మిత్రలను కొనసాగిస్తూ గ్రామాలపు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి విజయ్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం పంచాయతీలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. అందులో భాగంగానే వారికి వేతనాలను 15వ ఫైనాన్స్ ద్వారా వచ్చే నిధుల నుండి చెల్లించడానికి నిర్ణయం తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు. రెండవ సచివాలయ కార్యదర్శి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవి జయంతి ఉత్సవం

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ఖాద్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానంలో బుధవారం శ్రీ ఆండాల్ తిరునక్షత్రము(గోదాదేవి జయంతి) ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయ దారులుగా ఆలయ ట్రస్టు మాజీ ఛైర్మన్ శ్రీహరి, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దూరవిద్య ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలో ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (దూర విద్యా విధానంలో) 2024-25 సంవత్సరానికి పదవ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర కోఆర్డినేటర్ రవీంద్ర రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి మండల పరిధిలోని యనమల పల్లి ఉన్నత పాఠశాలలో పది ,ఇంటర్మీడియట్ ప్రవేశాలకు సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ కోఆర్డినేటర్ యనమల పల్లి ప్రధానోపాధ్యాయులు పి సుధాకర్, యనమలపల్లి కోఆర్డినేటర్ కడియాల మల్లికార్జున పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

గాండ్లపెంట : మండల పరిధిలోని మల్ల మీద పల్లి సచివాలయాన్ని ఎంపీడీవో కె రామానాయక్ బుధవారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరుపట్టికను పరిశీలించారు. ఒడిఎఫ్ సర్వే త్వరగా పూర్తిచేయాలని ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యను పరిశీలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ, 104 సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాశక్తి-హిందూపురం

మున్సిపల్ పరిధిలోని డ్రైవర్స్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త శ్రీనివాస రావు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ జేవి అనిల్ కుమార్, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ ఛైర్మన్ జేఈ వెంకటస్వామి, టిడిపి పట్టణ అధ్యక్షులు డీఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు టిడిపి నాయకులు బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డితో కలసి డ్రైవర్స్ కాలనీలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ కో ఎడిఇ, ఎఇలు, మున్సిపల్ డిఈ బాలసుబ్రమణ్యం, రెవెన్యూ, ఇతర అధికారులతో పాటు కౌన్సిలర్ సతీష్ కుమార్, నాయకులు నాగేంద్ర, నబీరసూల్, మల్లికార్జున, ఖలీం, ఫాజిల్, జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

చేనేత సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-సోమందేపల్లి

చేనేతల సమస్యలను పరిష్కరించాలని ఎపి చేనేత సంఘం జిల్లా నాయకులు రాజగోపాల్ డిమాండ్ చేశారు.జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘ మండల కమిటీ ఆధ్వర్యంలో చేనేత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిప్యూటీ తహశీల్దార్ శంకరకు వినతి పత్రం ఇవ్వడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో వ్యవసాయం తర్వాత అత్యధిక జనాభా చేనేత పరిశ్రమపై జీవన ఆధారంగా జీవిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు మారిన చేనేత కార్మికుల పరిస్థితి మారలేదని విమర్శించారు. ప్రభుత్వం వచ్చే ఆర్థిక బడ్జెట్లో కనీసం చేనేత కార్మికులకు రూ. 2వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలన్నారు. జిల్లాలో స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ టీమును ఏర్పాటు చేసి చేనేతను ఆదుకోవాలని కోరారు. పట్టు నూలు ధరలు తగ్గించి 50 శాతంతో సబ్సిడీతో ఇవ్వాలని, చేనేత పై జీఎస్టీ ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతి చేనేత కార్మికునికి షరతులు లేకుండా పింఛన్ వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎస్ చాంద్ బాషా, చేనేత మండల కమిటీ నాయకులు శ్రీకాంత్, లక్ష్మీనారాయణ, మాజీ వార్డుమెంబర్ వెంకటేశులు, రామాంజి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద చేనేత నాయకులు

బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

ఆర్డీటి ఆధ్వర్యంలో ఆర్డీటి స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ సెంటర్ నందు బుధవారం ఏరియా స్థాయి బాలికల అథ్లెటిక్స్ మీట్ నిర్వహించారు. ఈ పోటీలకు బత్తలపల్లి ఏరియా నుంచి మూడు టీములు, ముదిగుబ్బ ఏరియా నుంచి ఐదు టీములు మొత్తం ఎనిమిది టీములు పాల్గొన్నాయి. ఇందులో 78 మంది బాలికలు పాల్గొన్నారు. 60 మీటర్ల పరుగు, 100 మీటర్స్, 200 మీటర్స్, షాట్‌పుట్, లాంగ్ జంప్ మొదలైన ఈవెంట్స్ నిర్వహించారు. ప్రతిభ కనపర్చిన వారికి మెడల్స్ తో పాటు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. గెలుపొందిన వారందరూ జిల్లాస్థాయిలో జరిగే వాలికల అథ్లెటిక్స్ మీట్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డి ప్రమీల, హేమలత. పీడీలు లక్ష్మీనారాయణ. భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ధర్మవరం విద్యార్థులు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్



ప్రతిభా విద్యార్థులతో ఉపాధ్యాయులు

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సబ్ జూనియర్ అండర్ 16 బాలుర విభాగంలో బాల్ బాడ్మింటన్, షూటింగ్ బాల్ పోటీలకు జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరికి తగిన తర్ఫీదు తో రాష్ట్రస్థాయిలో విజయం పొందడం కోసం ప్రతిరోజు ప్రత్యేక శిక్షణ మెలకువలు తెలియజేస్తూ ప్రోత్సాహించడంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వి నాగేంద్ర ప్రత్యేక కృషి చేస్తున్నారని హెడ్మాస్టర్ జి శైలజ తెలిపారు.

హ్యాండ్‌లూమ్స్‌ను బతికిస్తాం : పరిటాల



చేనేత దినోత్సవంలో పరిటాల శ్రీరామ్, తదితరులు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

చేనేతల ఆత్మహత్యలు లేని ధర్మవరాన్ని తీసుకురావడంతో పాటు ఆ వ్యవస్థను పూర్తిగా కాపాడుకుంటామని ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. బుధవారం ధర్మవరంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కదిరి గేట్ సమీపంలో ఉన్న చేనేత విగ్రహానికి శ్రీరామ్ పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది చేనేతలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. చేనేత రంగంలో సుదీర్ఘ కాలంగా ఉన్న కార్మికులకు శ్రీరామ్ ఘనంగా సన్మానించారు. మంత్రి సత్యకుమార్ తో కలిసి చేనేతల్ని ఆదుకునే విధంగా నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణాధ్యక్షులు పరిశే సుధాకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ బీరే గోపాలకృష్ణ, కాచర్ల కంచన్న, మాజీ జెడ్పీ ఛైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, సందా రాఘవ, జింకా పురుషోత్తం, పళ్లెం కృష్ణ, మేకల రామాంజినేయులు, మహేష్ చౌదరి, భీమనేని ప్రసాద్ నాయుడు, కొత్తపేట ఆది, దళవాయి కుళ్ళయప్ప, బీబీ, సునంద, జిలకర శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా బుధవారం కదిరి గేటు వద్ద గల చేనేత విగ్రహానికి బిజెపి నాయకులు పూలమాలవేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు హరీష్, అంబటి సతీష్, జయశ్రీ, గిర్రాజు నగేష్ గుండా పుల్లయ్య, సాకే ఓబులేసు జింక చంద్ర, గొట్లూరు చంద్ర, భక్తవత్సల నాయుడు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితో ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి - కదిరి టౌన్

మహిళలు నైపుణ్య అభివద్ధితో ఆర్థిక అభివృద్ధి సాధించగలరని నాబార్డ్ డీడీఎం అనురాధ పేర్కొన్నారు. కదిరి పట్టణంలోని శుభశ్రీ సారీ ప్రింటింగ్ యూనిట్‌లో వరల్డ్ సంస్థ ఆధ్వర్యంలో శారీస్ హ్యాండ్ బ్లాక్ ప్రింటింగ్‌లో మహిళలకు ఇస్తున్న శిక్షణ బుధవారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి నాబార్డ్ డీడీఎం అనురాధ , రూట్ సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి , వర్డ్ సంస్థ యశోద, ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ వీర మారుతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి కల్పించిన సంస్థను అభినందించారు. శిక్షణ పొందిన వారికి బ్యాంకు ద్వారా రుణ వసతి కల్పిస్తామని వివరించారు. శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ తో పాటు టూల్ కిట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్డ్ సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తహాశీల్దార్లు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న పుట్టపర్తి తహాశీల్దార్ అనుపమ



రొద్దం తశీల్దార్ నాగేంద్రను సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి మండలం తహాశీల్దార్‌గా అనుపమ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఈమె గతంలో కర్నూలు జిల్లా నుండి సత్యసాయి జిల్లాకు బదిలీపై వచ్చారు. ఈమె గతంలో కలెక్టరేట్లో మెజిస్టీయల్ సూపరింటెండెంట్‌గా రెండు సంవత్సరలపాటు విధులు నిర్వహించారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, వీఆర్వోలు, కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది నూతన తహాశీల్దార్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని, కార్యాలయ సమయాల్లో తమను నిర్భయంగా కలవవచ్చునని రెవెన్యూ పరంగా ఉన్న భూ సమస్యలు చట్టపరంగా ఉంటే రికార్డులను సరిచూసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

రొద్దం :రొద్దం తహాశీల్దార్‌గా నాగేంద్ర బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది, తెలుగుదేశం పార్టీ మండల నాయకులు, రొద్దం మాజీ సర్పంచి అశ్వత నారాయణ, ఎం కొత్తపల్లి సర్పంచి నాగరాజు వీరన్న, నాగప్ప తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

పరిగి : పరిగి తహాశీల్దార్‌గా హసీనా సుల్తానా బుధవారం బాధ్యతలు స్వీకరించారు.రొళ్ల మండలం నుండి పరిగి మండలానికి బదిలీపై వచ్చిన ఆమెకు రెవెన్యూ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కార్యాలయ ఆవరణంలో మొక్కలు నాటారు. పలువురు టిడిపి నాయకులు ఆమెకు పుష్ప గుచ్చాలు అందజేశారు. అనంతరం మండల రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించిన ఆమె రెవెన్యూ అధికారులు నిష్పక్షపాతంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గోవింద్ రెడ్డి, సూర్యనారాయణ, సత్యనారాయణ, సోమప్ప తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : కొత్తచెరువు తహాశీల్దార్‌గా నాగరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు తహాశీల్దార్‌ను సన్మానించారు.

చిలమత్తూరు :చిలమత్తూరు మండల తహాశీల్దార్‌గా ఆనంద్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల విధుల నేపథ్యంలో ఇక్కడ పని చేసిన భాగ్యలత స్థానంలో ఆనంద్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆనంద్ కుమార్ కి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

లేపాక్షి : లేపాక్షి తహాశీల్దార్‌గా సౌజన్యలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆమెకు కార్యాలయం సిబ్బంది పుష్ప గుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

నల్లమాడ : నల్లమాడ తహాశీల్దార్‌గా రంగనాయకులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా టిడిపి నాయకులు నూతన తహాశీల్దార్‌ను కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మైలే శంకర్, డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, హెడ్మాస్టర్ ఆర్ చాంప్లాన్ నాయక్, ఎం రవికుమార్, సి రాజారెడ్డి, ఆర్ నితిన్ కుమార్, శివ ప్రసాద్ రెడ్డి, వలం కిష్టప్ప, డి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

మండలకేంద్రంలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ కేంద్రాన్ని పున్నప్రారంభించాలని సీఐటీయూ నాయకులు కుళ్లాయప్ప, శ్రీరాములు కోరారు. గతంలో మండల కేంద్రంలోని సచివాలయంలో ఆధార్ కేంద్రం ఉండేదన్నారు. కొన్ని నెలల క్రితం ఐరిష్ మరమ్మతులకు గురికావడంతో కేంద్రం పనిచేయడం లేదన్నారు. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. స్థానికంగా ఆధార్ కేంద్రం లేకపోవడంతో ప్రజలు నానా తంటాలు పడాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే స్థానిక ఆధార్ కేంద్రాన్ని పున: ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

జాతీయ చేనేత దినోత్సవం

ప్రజాశక్తి-సోమందేపల్లి

జాతీయ చేనేత ఐక్యవేదిక ఆధ్వర్యంలో మండల కేంద్రంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. చేనేత పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రభుత్వం చేనేత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ చేనేత ఐక్యవేదిక జిల్లా నాయకులు శీలా నారాయణస్వామి, దాసరి సుధాకర్, మనూతూరి ఈశ్వర్, దేవాంగ వెంకటేశులు,కురబ శ్రీనివాసులు, వడ్డీ రవీంద్ర, ఈడిగ నాగరాజు, తలారి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సచివాలయ సిబ్బంది సమయానికి విధులకు హాజరై, బయోమెట్రిక్ తప్పనిసరి వేయాలని డిఎల్‌డిఎఒ శివారెడ్డి, ఎంపిడిఒ నాగేశ్వరరెడ్డి ఆదేశించారు. ఈ మేరకు వారు బుధవారం మండలంలోని జగరాజుపల్లి, కొట్లపల్లి ,పెడపల్లి, దిగువ చెరువుపల్లి,వెంకట గారి పల్లి గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, పలు రికార్డులను పరిశీలించారు.

రేషన్ దుకాణాలు ప్రారంభం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు గోకులం, మండలంలోని వెంగళమ్మ చెరువు గ్రామాలలో చౌక ధాన్యపు డిపోలను బుధవారం టిడిపి నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పదవ వార్డ్ కౌన్సిలర్ వెంకటరమణమ్మ, వెంగళం చెరువు పంచాయతీ మాజీ సర్పంచి ఆదినారాయణ రెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు శ్రీరామ్ రెడ్డి, తెలుగు యువత నాయకుడు రాజశేఖర్, నాయకులు ప్రభాకర్, గోవిందరాజులు, నరేంద్ర, రేషన్ క్రిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : మండల పరిధిలోని వైబి హళ్లి పత్తికుంటగ్రామంలో చౌక దుకాణాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రామాంజనేయులు, మాజీ సర్పంచి చంద్రప్ప, టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, స్థానిక నాయకులు రవీంద్రారెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, సూర్యనారాయణ, లక్ష్మీనారాయణ, బుడ్డయ్యపాలెంప్రసాద్, మురళి తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం : మండలంలో ని గౌడనకుంట గ్రామంలో నూతన చౌకధాన్యపు డిపోను టీడీపీ మండల నాయకులు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో షాప్ డీలర్ నాగరాజు నవీన్, టిడిపి మండల కన్వీనర్ గణేష్, మాజీ జడ్పీటీసీ నరసింహామూర్తి, మాజీ మండల కన్వీనర్ శివరుద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

9న గోరంట్లలో మంత్రి పర్యటన

ప్రజాశక్తి - గోరంట్ల

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఈనెల 9న గోరంట్ల మండలంలో పర్యటించనున్నారని టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి స్థానిక కార్యాలయంలో బుధవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో కన్వీనర్ మాట్లాడుతూ పాలసముద్రం గ్రామం నుండి గౌని వారి పల్లి వరకు బైక్ ర్యాలీ చేయడం జరుగుతుందన్నారు బైక్ ర్యాలీలో అందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు హిందూపురం పార్లమెంటు టిడిపి కార్యదర్శి నరసింహప్ప, మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థ రెడ్డి బాలకృష్ణ చౌదరి, వేణు రాయల్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం వన్ టౌన్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని సిఐ రాజగోపాల్ నాయుడు పేర్కొన్నారు. బుధవారం స్థానిక వన్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సిఐగా పనిచేసిన శ్రీనివాసులు విఆర్‌కు వెళ్లారు. తిరుపతి పిటిసిలో సిఐగా పనిచేస్తున్న రాజగోపాల్ నాయుడు బాధ్యతలు స్వీకరించారు.

తపాలా పొదుపు పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - గోరంట్ల

భారత ప్రభుత్వం తపాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పొదుపు పథకాలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హిందూపురం ఐపిపిబి మేనేజర్ మురళి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం గోరంట్ల సబ్ పోస్ట్ ఆఫీస్‌లో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు, పోస్టుమ్యాన్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం పొదుపు పథకాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల సబ్ పోస్టుమాస్టర్ కిష్టప్ప, మెయిల్ ఓవర్సీస్ నాగరాజు, గోరంట్ల మండల పరిధిలోని 12 బ్రాంచ్ ఆఫీస్‌ల పోస్టుమాస్టర్లు, పోస్టుమ్యాన్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ చేనేత సదస్సుకు సోమందేపల్లి వాసి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల కేంద్రానికి చెందిన శ్రీ సత్యసాయి జిల్లా చేనేత కార్మిక యూనియన్ ప్రెసిడెంట్ తలారి రామాంజనేయులు బుధవారం ఢిల్లీలో జరుగుతున్న 9వ జాతీయ చేనేత సదస్సుకు హాజరవుతున్నారు. ఢిల్లీలో జరుగుతున్న చేనేత సదస్సుకు రాష్ట్రం నుండి 17 మందికి వెళ్ళగా సత్యసాయి జిల్లా నుంచి తనకు అవకాశం రావడం చాలా సంతోషంగా ఉందని తలారి రామాంజనేయులు చెప్పారు. ఈ పాంత చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సదస్సులో పాల్గొన్న ప్రముఖులకు తెలియజేయడానికి తన వంతు ప్రయత్నం చేస్తానని ఆయన పేర్కొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



పుట్టపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసిడిఎస్, వైద్య శాఖాధికారులు



నల్లచెరువులో అంగన్వాడీల ర్యాలీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మంజువాణి పేర్కొన్నారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, పుట్టపర్తి ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కార్యాలయం నుండి వై జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా వైద్యాధికారిణి మంజువాణి మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం విలువలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ నాగమల్లేశ్వరి, సిడిపిఒ గాయత్రి, సూపర్‌వైజర్లు పుష్పలత, కౌసల్య, భారతి, కార్యాలయ సిబ్బంది సుదీష్ వర్మ, అశోక్, నారాయణరెడ్డి, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండలం పరిధిలోని సిరివరం గ్రావ అంగన్వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. తల్లిపాల విశిష్టతపై గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మంజుల, అంగన్వాడీ కార్యకర్తలు శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : అంగన్వాడీల ద్వారా పిల్లలతో పాటు తల్లులు కూడా ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. స్థానిక ఏపీ ఎన్జీవో హోంలో మహిళాభివద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జరిగిన అంతరాలను పూరించి తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహిద్దాం అనే కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అంగన్వాడీ కేంద్రంలో ఉన్న పిల్లలకు ఆట వస్తువులను ఎమ్మెల్యే అందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ హుస్సేన్, ఐసిడిఎస్ అధికారులు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పవన్ కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, పిల్లల తల్లిదండ్రులు, అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు. కదిరి మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి సచివాలయంలో బుధవారం ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని సంబంధిత అంగన్వాడీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : మండల పరిధిలోని అల్లాపల్లి పంచాయతీలోని గౌనిపల్లి, అల్లాపల్లి, చౌడంపల్లి ,గౌరాపురం, దాదిరెడ్డిపల్లి, పగడాల వారి పల్లి, ఎర్రవల్లి, కుక్కంటి వారి పల్లి, బోయపల్లి, రాజుపాలెం, ఉగ్గిరెడ్డిపల్లి అంగనవాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అలాగే గౌనిపల్లి అంగన్వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ విజయ కుమారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు ఎస్ షమీం, స్వర్ణ, సుకన్య, వెంకట నరసమ్మ, మంజుల, పార్వతి, శ్యామల, పి.సుకన్య, ఎం శ్యామల, సునంద తదితరులతో పాటు బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సిడిపిఒ అనురాధ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలో అంగనవాడీ, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎసిడిపిఒ గీతా బాయి, సూపర్ వైజర్ శుభారాణి, అంగన్వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి శ్రీదేవి, అంగనవాడీ కార్యకర్తలు శోభారాణి, ప్రమీల, అరుణ, నాగరతమ్మ, మెహరూన్, సరిత, ప్రతిభ, వేదవతి, చంద్రకళ, ఎఎన్ఎంలు శారద బాయి, రాధ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో కదిరి ఎమ్మెల్యే కందికుంట

రొద్దం : తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమనిఐసిడిఎస్ సూపర్వైజర్లు అనురాధ, సుజాత అన్నారు. బుధవారం మండలంలోని చిన్నమంతూరు1, 2, రొద్దం, రెడ్డి పల్లి, అంగన్వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం రాధా,అంగన్వాడీ కార్యకర్తలు అనిత, ఓబుళమ్మ, గంగరత్న, ఆశ కార్యకర్త, హెడ్‌మాస్టర్ పోతులయ్య, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

నల్లచెరువు : నల్లచెరువు, తనకల్లు, గాండ్లపెంట అంగన్వాడీ కార్యకర్తలతో సిడిపిఒ గంగరత్నమ్మ ఆధ్వర్యంలో నల్లచెరువు మండల కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు అనంతరం ర్యాలీని నిర్వహించారు. తల్లిపాల విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అలేఖ్య, సిహెచ్ఒ రామచంద్ర రెడ్డి, సూపర్‌వైజర్ రఫే మున్నీసా, లక్ష్మీదేవి తనకల్లు పద్మావతి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు